## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, మే 25: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బీబీపేట్, మే 25: బీబీపేట, దోమకొండ మండలాల్లోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయా మండలాల వ్యవసాయాధికారులునరేందర్, మణిదీపిక ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికీ గుర్తింపు కార్డు ఇచ్చినట్లుగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో భూమి ఉన్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారని పేర్కొన్నారు. రైతులందరూ ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు, పట్టాపాసుపుస్తకం తీసుకొని స్థానికంగా ఉండే ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

## మొరం తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

నిజాంసాగర్, మే 25: నిజాంసాగర్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మొరం తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీతో పాటు మొరంతో ఉన్న రెండు ట్రాక్టర్లు, ఆరు ఖాళీ ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఇందిరమ్మ గృహాలకు మార్కింగ్



ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న నాయకులు

లింగంపేట, మే 25: మండలంలోని మోతె గ్రామంలో ఇందిరమ్మ గృహాలకు మార్కింగ్ నిర్వహించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలో 34 మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, భాస్కర్‌రావు, గోపాల్‌రావు, పెంటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఊర పండుగ



బోనాలను ఊరేగిస్తున్న తాడ్వాయి గ్రామస్తులు

లింగంపేట(తాడ్వాయి), మే 25: తాడ్వాయి మండల కేంద్రంలో ఊర పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరడమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రానున్న వర్షా కాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు, పశు సంపద చల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. శివసత్తుల నాట్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అన్ని కుల సంఘాల బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## గురుకులాల్లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, మే 26: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాలు, కళాశాలల్లో పార్ట్ టైం విద్యాబోధన కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ కర్త నాగేశ్వర్ రావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి (బాలుర), ఉప్పల్‌వాయి (బాలుర), భిక్కనూరు (బాలుర), అచ్చంపేట (బాలుర), తాడ్కోల్ (బాలికల), బాన్సువాడ (బాలికల), తాడ్వాయి (బాలికల), లింగంపేట (బాలికల), ఎక్లారా(బాలికల), తక్కడ్‌పల్లి (బాలికల), దోమకొండ (బాలికల) సంక్షేమ కాలేజీలు, పాఠశాలల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బాలికల గురుకులాల్లో కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ చేసిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ లోపు ఖాళీలు ఉన్న గురుకులాల్లో దరఖాస్తు అందజేయాలని సూచించారు. అభ్యర్థులను మెరిట్ అధారంగా, డెమో ప్రతిపాదికన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# విద్యుత్ సౌకర్యం కల్పించండి సారూ..!



వీధి దీపాలు లేని ముస్లిం కాలనీకి వెళ్లే రోడ్డు

నాగిరెడ్డిపేట, మే 25: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అంబేద్కర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రాథమిక పాఠశాల నుంచి ముస్లింగల్లీ వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయక పోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ముందు రోడ్డు నుంచి మాల్తుమ్మెద సొసైటీ కార్యాలయం, ఎస్సీ కాలనీ వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మరో వైపు సుభాష్ చంద్రబోస్ కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కానీ మధ్యలో ఉన్న ముస్లింగల్లీ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు విద్యుత్ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేయకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో కాలనీకి రావాలంటే.. చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఆ మార్గంలో కాలనీకి రావడానికి మహిళలు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి మధ్యలో నిలిచిన ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ఈ మార్గంలో గోపాల్‌పేట గ్రామస్తులతో పాటు చీనూర్, మేజర్‌వాడీ, గోలిలింగాల గ్రామస్తులు నిత్యం వందలసంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించేలా చూడాలని వేడుకుంటున్నారు.

# దారి మధ్యలో విద్యుత్ స్తంభం

**రాత్రి వేళలో ప్రయాణించాలంటే భయం.. భయం**

నాగిరెడ్డిపేట, మే 25: మండలంలోని మేజర్‌వాడి గ్రామ సమీపంలోని ఊర చెరువు కట్టపై దారి మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి వ్యవసాయ పనుల కోసం నిత్యం చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్లు, పశువులు, ఎడ్ల బండ్లు వెళ్తుంటాయి. రాత్రి సమయంలో స్తంభాన్ని గుర్తించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.



చెరువు కట్టపై దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

## రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేందర్



సురేందర్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 25: రేషన్ డీలర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన నాగం సురేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎల్లారెడ్డిలోని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫామ్ హౌస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం నాగం సురేందర్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, నాయకులు శ్రావణ్‌కుమార్, ఇమ్రాన్, ఎరుకల సాయిలు, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం

రామారెడ్డి, మే 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి, వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఆనందంగా గడిపారు. సమాజ సేవ చేయాలని తీర్మానించారు. తమతో చదువుకొని అకాల మరణం పొందిన వారిని స్మరించుకుంటూ.. రెండు నిమిషాలు మౌనం పాటించారు.



సమ్మేళనంలో పాల్గొన్న రామారెడ్డి పాఠశాల 1997-98బ్యాచ్ విద్యార్థులు

## కొనుగోలు కేంద్రం సందర్శించిన డీపీఎం

లింగంపేట, మే 25: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సెర్ప్ డీపీఎం సురేశ్ ఆదివారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో సేకరించిన, తరలించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యం త్వరగా తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. తూకం వేసిన ధాన్యం వెంటనే లోడింగ్ చేయాలని హమాలీలకు సూచించారు. డీపీఎం వెంట ఏపీఎం చామంతి శ్రీనివాస్, సీసీ మన్సూర్‌తో పాటు గ్రామ సంఘం మహిళలు ఉన్నారు.



ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న డీపీఎం సురేశ్

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కామారెడ్డి, మే 25: కామారెడ్డి జిల్లా మున్నూరుకాపు, ఛత్రపతి టీచర్ సొసైటీ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రశంసా పత్రాలు, మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమం లో ఆర్యక్షత్రియ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, సొసైటీ అధ్యక్షుడు బాలకిషన్ రావు, మనోహర్‌రావు, కృష్ణాజీరావు, దత్తాత్రి, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి మామిండ్ల అంజయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం లింగం, జిల్లా మహిళా అధ్యక్షురాలు లలిత, బాధ్యులు రాజలింగం, తోగ భూమన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హన్మాండ్లు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో తిరంగా ర్యాలీ

ఎల్లారెడ్డి రూరల్, మే 25: జయహో.. సిందూర్, భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలు చేస్తూ ప్రజలు, వ్యాపారులు, పలువురు నాయకులు కలిసి ఎల్లారెడ్డి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ గాంధీచౌక్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ మువ్వన్నెల జెండాను చేతిలో పట్టుకొని దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు నడిచారు. గాంధీచౌక్‌కు ర్యాలీ చేరుకున్న అనంతరం పటాకులు కాల్చారు. అనంతరం ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శివ అనే జవానును ఘనంగా సన్మానించారు. భారత్ తరపున ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న భారత జవాన్‌లకు పూర్తిస్థాయి మద్దతును ఈ సందర్భంగా ప్రకటిస్తున్నామని, వారికి పాదాభివందనం చేస్తున్నామన్నారు.



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

## ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్**

కామారెడ్డి, మే 25: జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయని, వాటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండానే జిల్లాలో పలు కొత్త పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయన్నారు. పాత పాఠశాలల నూతన బ్రాంచ్‌ల పేరుతో ప్రారంభిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ.. అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కనీస సౌకరాలు లేక అపార్ట్‌మెంట్‌లో అనుమతి లేకుండా పాఠశాలలను ప్రారంభిస్తున్నారన్నారు. డీఈవో, ఎంఈవోలు కేవలం ప్రకటనలు ఇచ్చి మాత్రమే చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌నాయక్, ప్రవీణ్, రాజేందర్, నీమానాయక్, శ్రీధర్, మోహన్, రవి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ తీగ చోరీ



బోర్లం క్యాంప్‌లో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

బాన్సువాడ రూరల్, మే 25: మండలంలోని కొయ్యగుట్ట- కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న బోర్లం క్యాంపు గ్రామ శివారులో రైతుల పంట పొలాలకు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగను ఎత్తుకెళ్లారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బోర్లం క్యాంపులో ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌ను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్ తీగను చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపి వేలి ఈ చోరీకి పాల్పడినట్లు రైతులు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందుతులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని రైతులు కోరారు.

## తెరవే జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెరవే బాధ్యులు

కామారెడ్డి, మే 25: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రెండో జిల్లా మహాసభలను జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కాలేజీలో ఆదివారం ఆవిష్కరించారు. మహాసభలను మూడు సెక్షన్లుగా నిర్వహించనున్నామని తెరవే ప్రతినిధులు తెలిపారు. భాష, సాహిత్య, సాంస్కృతిక విధానం, సామాజిక దృక్పథం, మారుతున్న దేశ కాల పరిస్థితులు, రచయిత బాధ్యత అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, రచయిత, పరిశోధరకులు తిరుమలరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య బాధ్యురాలు విమలక్క, తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, కవులు, రచయితలు జగన్నాథం, లచ్చయ్య, ఉదారి నారాయణ హాజరవుతారని తెలిపారు. తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్ రాజ్, ఉపాధ్యక్షుడు గంగప్రసాద్, కాసర్ల రాంచంద్రం, నాగభూషణం, లింగం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

లింగంపేట, మే25: మండలంలోని మూడు సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత ఏఈవోల వద్ద అందించి పర్మిట్లు పొందాలని సూచించారు. లింగంపేట, శెట్పల్లి సంగారెడ్డి, నల్లమడుగు సహకార సంఘాల్లో వంద బస్తాల చొప్పు న అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతు లు తీసుకెళ్లాలని సూచించారు.

***రాయితీపై జీలుగ విత్తనాలు..***

నాగిరెడ్డిపేట, మే 25: మండలానికి 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికిరణ్ తెలిపారు. మాల్తుమ్మెద, తాండూర్ సింగిల్ విండోల్లో 30 క్వింటాళ్ల చొప్పున అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. సబ్సిడీపై రూ. 2137కు అందిస్తున్నట్లు చెప్పారు. అవసరం ఉన్న రైతులు తమ పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వచ్చి జీలుగ బస్తాలను తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. సోమవారం ఉదయం 11 గంటలకు విత్తనాల పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్, అధికారులు

***జీలుగ విత్తనాల పంపిణీ షురూ..***

నిజాంసాగర్, మే 25: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ వాజీద్‌అలీ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో నవ్య, ఏఈవో రేణుక, సొసైటీ సిబ్బంది, రైతులు మిడుత సాయిలు, మల్లారెడ్డి, గజ్జల బలరాం తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

బాన్సువాడ రూరల్, మే 25: మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఈనెల 28వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను తాడ్కోల్ గ్రామంలో అంబేద్కర్ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రవి, డివిజన్ ఉపాధ్యక్షుడు మన్నెచిన్న సాయిలు, సంఘం ప్రతినిధులు కుమ్మరి రాజు, అంజయ్య, దత్తు, కొర్రి సాయిలు, శివ, పాపయ్య, భాస్కర్, పెద్ద సాయిలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ సంఘ నాయకులు

## విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 25: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను వినియోగదారులు వెంటనే చెల్లించాలని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏడీఈ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పలు వ్యాపార సంస్థల విద్యుత్ బకాయిలను ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడీఏ మాట్లాడుతూ.. ప్రతినెలా క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్ బిల్లులను ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని సూచించారు. ఆయనతో పాటు ఆర్‌సీ కృష్ణకిశోర్, లైన్‌మన్ బాల్‌కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న సిబ్బంది

## ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

రాజంపేట్, మే 25: మండలంలోని ఆరేపల్లిలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ఆదివారంతో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని ఏపీఎం సాయిలు తెలిపారు. మొత్తం 122మంది రైతుల నుంచి 3752 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్‌మిల్లులకు తరలించామన్నారు. రైతులకు సమస్యలు లేకుండా కొనుగోలు కేంద్రం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు నర్మల్ల రామవ్వ, సీసీ రమేశ్, వీవోఏ సిద్దేశ్వరి, హరీశ్, రాములు, ట్యాబ్ ఆపరేటర్ విక్కీ తదితరులు పాల్గొన్నారు.



ఆరేపల్లిలో బస్తాలు లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు